

## 26న గద్దర్ యాదిలో
# 'ప్రశ్నించే గొంతులు, సాధించిన విజయాలు' సభ
### హాజరుకావాలని సబ్బండవర్గాలకు జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజా యుద్ధ నౌక గద్దర్‌పై కాల్పులు జరిగి 29 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 26వ తేదీన హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'ప్రశ్నించే గొంతులు సాధించిన విజయాలు' పేరుతో సభను గద్దర్ ఫౌండేషన్ నిర్వహిస్తున్నదని, ఈ సభకు సబ్బండ కులాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు.

హైదరాబాద్‌లోని బిసి జెఎసి రాష్ట్ర కార్యాలయంలో శనివారం గద్దర్ ఫౌండేషన్ చైర్మన్ జివి.సూర్య కిరణ్‌తో కలిసి గద్దర్ సభ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ పాటపై తూటా పేలిన గద్దర్ వెరవకుండా తాను నమ్మిన సిద్ధాంతం కోసం, బహుజన రాజకీయ అధికారం కోసం చివరి శ్వాస వరకు పోరాడారని, ఇలాంటి గద్దర్ జీవితం రేపటి భవిష్యత్ తరాలకు ఆదర్శనీయమన్నారు. గద్దర్ ఆట, మాట, పాట తెలంగాణలో వేలాది మంది ప్రశ్నించే గొంతులను తయారు చేసిందని, దానివలన తెలంగాణలో జరిగిన పోరాటాలలో అనేక విజయాలు సాధించారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో గద్దర్ ఫౌండేషన్ కార్యదర్శి సరిత, బిసి నేతలు గజ్జ కృష్ణ, కుల్కచర్ల శ్రీనివాస్, జాజుల లింగంగౌడ్, నంద గోపాల్, గజ్జెల సత్యరాజు గౌడ్, తిరుపతయ్య, కె.వెంకటేష్ గౌడ్, సివి.రావు తదితరులు పాల్గొన్నారు.

# ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

### 798 ఆక్రమణలను తొలగించిన జిహెచ్ఎంసి
### పలుచోట్ల తలెత్తిన ఉద్రిక్తత పరిస్థితులు
### ఫుట్‌పాత్ అక్రమణలపై జిహెచ్ఎంసి 'స్పెషల్ డ్రైవ్'

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలో పాదచారుల హక్కులను కాపాడేందుకు, ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించేందుకు మహానగర పాలక సంస్థ(జిహెచ్ఎంసి) అధికారులు శనివారం ఉక్కుపాదం మోపారు. హైకోర్టు ఆదేశాలు, ప్రభుత్వ సూచనల మేరకు నగరంలోని ఆరు జోన్లలో ఒకేసారి చేపట్టిన ఈ భారీ 'స్పెషల్ డ్రైవ్'లో మొత్తం 798 ఆక్రమణలను తొలగించారు. అయితే, కొన్ని ప్రాంతాల్లో స్థానిక నాయకులు, వ్యాపారుల అడ్డగింతలతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

**ఒక్కరోజే భారీ ఆపరేషన్..**

జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, చీఫ్ సిటీ ప్లానర్ కె.శ్రీనివాస్, జోనల్ కమిషనర్ల పర్యవేక్షణలో సాగిన ఈ ఆపరేషన్‌లో పోలీసు, ఇంజనీరింగ్, పారిశుద్ధ్య విభాగాలు సమన్వయంతో పాల్గొన్నాయి. మొత్తం ఆరు జోన్‌లలోని ప్రధాన రహదారులపై నిర్వహించిన ఈ దాడుల్లో 340 శాశ్వత, 458 తాత్కాలిక ఆక్రమణలను అధికారులు నేలమట్టం చేశారు.

జోన్‌ల వారీగా తొలగింపుల వివరాలు..

- శంషాబాద్ బస్ స్టాప్ నుండి రాళ్లగూడ రోడ్డు వరకు అత్యధికంగా 222 ఆక్రమణలు (168 శాశ్వత, 54 తాత్కాలిక) తొలగించారు.
- లాడ్ బజార్ నుండి పురానాపూల్ వరకు 162 ఆక్రమణలను క్లియర్ చేశారు.
- ఆరాంఘర్ నుండి అత్తాపూర్ వరకు 175 ఆక్రమణలపై చర్యలు తీసుకున్నారు.
- జాంబాగ్ నుండి అఫ్జల్‌గంజ్ వరకు 154 ఆక్రమణలను తొలగించారు.
- శ్రీనగర్ కాలనీలో 22 ఆక్రమణలతో పాటు 3 ప్రహరీ గోడలను కూల్చివేశారు.
- రైల్వే స్టేషన్ పరిసరాల్లో 60 తాత్కాలిక ఆక్రమణలను తొలగించారు.

**అడ్డుకున్న నేతలు.. వెనక్కి తగ్గిన సిబ్బంది !**

నగరవ్యాప్తంగా డ్రైవ్ విజయవంతంగా సాగుతున్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో అధికారులకు చుక్కెదురైంది. పాతబస్తీలో అక్రమ కట్టడాల కూల్చివేతకు వెళ్లిన



జిహెచ్ఎంసి సిబ్బందిని ఎంఐఎం నాయకులు, కార్యకర్తలు అడ్డుకున్నారు. అధికారులతో వాగ్వాదానికి దిగి, బెదిరింపులకు పాల్పడటంతో జెసిబిలను వెనక్కి పంపాల్సిన పరిస్థితి ఏర్పడింది. మోండా మార్కెట్ పరిధిలో షాపుల కూల్చివేతను నిరసిస్తూ వ్యాపారులు, స్థానికులు ఒక్కసారిగా అధికారులపైకి తిరగబడ్డారు. జెసిబిలను అడ్డుకుని దాడికి యత్నించడంతో భయంతో సిబ్బంది పరుగులు తీశారు. అనంతరం వ్యాపారులు పోలీస్ స్టేషన్‌ను ముట్టడించడంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో అధికారులు తాత్కాలికంగా కూల్చివేతలను నిలిపివేశారు.

**కమిషనర్ హెచ్చరిక**

ఆటంకాలు ఎదురైనప్పటికీ, ఫుట్‌పాత్‌ల ఆక్రమణదారులపై కఠినంగా వ్యవహరిస్తామని కమిషనర్ ఆర్.వి.కర్ణన్ స్పష్టం చేశారు. పాదచారులకు నరకం చూపిస్తూ రోడ్‌లను ఆక్రమిస్తే సహించేది లేదన్నారు. ఇలాంటి స్పెషల్ డ్రైవ్‌లు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. వ్యాపారులు, పౌరులు నగర అభివృద్ధికి స్వచ్ఛందంగా సహకరించాలని కోరారు. నియమాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## సింగరేణిలో సహజ మరణానికి కూడా
# రూ.10 లక్షల ఉచిత బీమా పథకం
### యూనియన్ బ్యాంక్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇప్పటివరకు సింగరేణిలో కోటి రూపాయల ప్రమాద బీమా పథకాన్ని అమలు చేస్తున్న యూనియన్ బ్యాంక్ సింగరేణి యాజమాన్యం చేసిన సూచనల మేరకు సహజ మరణం చెందిన కార్మికులకు కూడా ఉచిత బీమా సౌకర్యాన్ని కల్పించాలని నిర్ణయించింది. యూనియన్ బ్యాంకులో కార్పొరేట్ సాలరీ అకౌంటు కలిగి ఉన్న కార్మికులు లేదా అధికారులు ఎవరైనా సరే మృతి చెందినట్లయితే వారికి పది లక్షల రూపాయల బీమా సౌకర్యాన్ని వర్తింప జేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు సింగరేణి సంస్థకు బ్యాంకు యాజమాన్యం తెలియజేసింది. సింగరేణి సంస్థ చైర్మన్, ఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఆదేశాల మేరకు డైరెక్టర్ పర్సనల్, ఫైనాన్స్ గౌతమ్ పోట్రు ప్రత్యేక చొరవ ఫలితంగా యూనియన్ బ్యాంకు యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఇది అమలులోకి రానున్నట్లు బ్యాంకు యాజమాన్యం పేర్కొంది.

# వేసవి రద్దీకి స్పెషల్ రైళ్ల పొడిగింపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వేసవి సీజన్‌లో పెరిగిన ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే పలు వారాంత స్పెషల్ రైళ్ల సేవలను మే చివరి వరకు పొడిగించింది. నరసాపూర్ తిరువణ్ణామలై (07219/07220) రైళ్లు బుధ, గురువారాల్లో, నరసాపూర్ ఎస్ఎంవిటి బెంగళూరు (07153/07154) రైళ్లు శుక్ర, శనివారాల్లో నడవనున్నాయి. ఈ రైళ్లు పాలకొల్లు, భీమవరం, గుడివాడ, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, కాట్పాడి, జోలార్‌పేట, కృష్ణరాజపురం తదితర ముఖ్య స్టేషన్లలో ఆగుతాయి. అన్ని రైళ్లలో 2ఎసి, 3ఎసి, స్లీపర్, జనరల్ కోచ్‌లు అందుబాటులో ఉంటాయని రైల్వే అధికారులు తెలిపారు.

# సికింద్రాబాద్–నాహర్లగున్ స్పెషల్ రైళ్లు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వేసవి రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్–నాహర్లగున్ మధ్య వారానికి ఒకసారి ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ప్రకటించింది. సికింద్రాబాద్ నాహర్లగున్ (07046) రైలు ప్రతి శుక్రవారం ఉదయం 8.30 గంటలకు బయలుదేరి ఆదివారం సాయంత్రం 4 గంటలకు చేరుకుంటుంది. నాహర్లగున్ సికింద్రాబాద్ (07047) రైలు ప్రతి సోమవారం మధ్యాహ్నం 1 గంటలకు బయలుదేరి బుధవారం రాత్రి 10 గంటలకు చేరుకుంటుంది. ఈ సర్వీసులు ఏప్రిల్ 10 నుంచి మే 25 వరకు కొనసాగుతాయి. ఈ ప్రత్యేక రైళ్లు చర్లపల్లి, నల్గొండ, గుంటూరు, విజయవాడ, రాజమండ్రి, విశాఖపట్నం పరిసర స్టేషన్లు, భువనేశ్వర్, కటక్, ఖరగ్పూర్, న్యూ జల్పాయిగురి తదితర ప్రధాన స్టేషన్లలో ఆగుతాయి. అన్ని రైళ్లలో 3ఎసి కోచ్‌లు మాత్రమే ఉంటాయని రైల్వే అధికారులు తెలిపారు.

## భారతదేశ ఫార్మా ఎగుమతుల్లో...
# 5 శాతానికి పైగా వృద్ధి నమోదు

**హైదరాబాద్ :** భారతదేశ ఫార్మా ఎగుమతుల్లో వృద్ధి నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఫిబ్రవరి వరకు భారతదేశ ఫార్మాస్యూటికల్స్ ఎగుమతులు 28 బిలియన్ డాలర్లకు పైగా చేరాయి. ఈ నేపథ్యంలో గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది5 శాతానికిపైగా వృద్ధిని నమోదు చేసిందని ఒక ఉన్నతాధికారి శనివారం తెలిపారు. ఫార్మాస్యూటికల్స్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఫార్మెక్సిల్) డైరెక్టర్ జనరల్ కె.రాజా భాను మాట్లాడుతూ ప్రస్తుతం సుమారు 60 బిలియన్ డాలర్ల వద్ద ఉన్న ఈ రంగం 130 బిలియన్ డాలర్లకు వృద్ధి చెందుతుందన్న అంచనా వేస్తున్నట్లు చెప్పారు. ప్రపంచ సవాళ్లు ఉన్నప్పటికీ వృద్ధి వేగాన్ని కొనసాగించిన కొన్ని రంగాలలో ఫార్మాస్యూటికల్స్ ఎగుమతులు ఒకటిగానిలిచాయి. ఫార్ములేషన్స్ బయోలాజికల్ వ్యాక్సిన్లు, ఆయుష్ ఉత్పత్తుల నేపథ్యంలో ఆర్థిక సంవత్సరం ఎఫ్‌వై–2026 ఏప్రిల్‌ఫిబ్రవరి కాలంలో ఎగుమతులు 28.29 బిలియన్ డార్లకు చేరుకున్నాయి. ఆర్థిక సంవత్సరం ఎఫ్‌వై–2025లోని ఇదే కాలంతో పోలిస్తే వృద్ధిని ప్రతిబింబిస్తుంది' అని 'చింతన్ శివిర్ స్కేలింగ్ అప్ ఫార్మా ఎక్స్‌పోర్ట్స్' ప్రారంభ సమావేశంలో ప్రసంగిసూ వివరించారు. డాలర్ల పరంగా లక్ష్యాలు నెరవేరినా, నెరవేరకపోయినా అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత కరెన్సీ బలహీనపడుతున్నందున రూపాయిల పరంగా ఎగుమతులు వృద్ధిని కనబరుస్తున్నాయని వాణిజ్యపన్నుల శాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ తెలిపారు. తాము నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవడం కష్టంగా కనిపిస్తున్నప్పటికీ సానుకూల మార్గంలోనే కొనసాగుతున్నామని అగర్వాల్ తెలిపారు. ఫార్మెక్సిల్ చైర్మన్ నమిత్ జోషి మాట్లాడుతూ భారతదేశం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఎఫ్‌వై–2025నాటి స్థాయిలకే ముగించే అవకాశం ఉందని చెప్పారు.

# కళ్ళు ఉండి కూడా చూడలేని కబోది కిషన్ రెడ్డి
### టిపిసిసి అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆరు గ్యారంటీలా అమలుపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని టిపిసిసి అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ అన్నారు. ఎన్నికలకు ముందు సిఎం రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ పరిపాలనలో దూసుకుపోతుంటే ప్రజల్లో రేవంత్ రెడ్డికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక కిషన్ రెడ్డి అసత్యాలను వల్లి వేస్తున్నారన్నారు. కళ్ళు ఉండి కూడా చూడలేని కబోదిగా కిషన్ రెడ్డి మాట్లాడుతున్నారని విమర్శించారు . తెలంగాణలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నాం కాబట్టే ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిపే సిఎం రేవంత్ పనితనానికి నిదర్శనం అని గుర్తుంచుకోవాలన్నారు.

# తప్పు నిరూపిస్తే రాజకీయాలు వదిలేస్తా
### ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హుజూరాబాద్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, ఆయన భార్య శాలినిరెడ్డిలు శనివారం హైదరాబాద్‌లోని సిఐడి కార్యాలయంలో హాజరయ్యారు. కౌశిక్‌రెడ్డి కరీంనగర్ సిపిపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో అధికారులు దాదాపు నాలుగు గంటల పాటు వీరిని విచారించారు. విచారణ ప్రక్రియ మొత్తాన్ని అధికారులు వీడియో రికార్డింగ్ చేశారు. జనవరి 29న హుజూరాబాద్‌లో సమ్మక్కసారలమ్మ జాతర సందర్భంగా జరిగిన గొడవ, పోలీసుల విధులకు ఆటంకం కలిగించడం, మతవిద్వేష వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై ఈ విచారణ జరిగింది. సిఐడి విచారణ ముగిసిన తర్వాత మీడియాతో మాట్లాడుతూ పాడి కౌశిక్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'నేను అనని మాటలు అన్నట్లుగా చిత్రీకరిస్తున్నారు. పొంగులేటి మైనింగ్ స్కామ్ నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే నాపై ఎథిక్స్ కమిటీ వేశారు. ప్రజల పక్షాన పోరాడటానికి నేనే దేనికైనా సిద్ధం. హుజూరాబాద్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటును ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. కరీంనగర్ జిల్లా చెత్తనంతా తెచ్చి హుజూరాబాద్‌లో వేస్తే ఊరుకోం. ఆ డంపింగ్ యార్డ్ కరోనా కంటే ప్రమాదం. ఈ విషయంలో నేను చేస్తున్న పోరాటాన్ని అణచివేయడానికి విచారణ పేరుతో అడ్డుకుంటున్నారు. ఈ నెల 7న హుజూరాబాద్‌లో దీక్షకు కూర్చుంటా. నేను మత మార్పిడిలపై వ్యాఖ్యలు చేసినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తా . నేను ఏదైనా తప్పు చేసినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచే తప్పుకుంటాను. కేసుల పేరుతో భయపెట్టాలని చూస్తే లొంగిపోయే ప్రసక్తే లేదు' అని స్పష్టం చేశారు. ఈ కేసును ప్రభుత్వం సిఐడికి అప్పగించడాన్ని ఆయన తప్పుబట్టారు. రాబోయే రోజుల్లో మళ్లీ కెసిఆర్ ముఖ్యమంత్రి అవుతారని, ఇప్పుడు పెట్టిన కేసులన్నీ అప్పుడు తిరగబడతాయని అధికారులను, ప్రభుత్వాన్ని ఉద్దేశించి హెచ్చరించారు. రాజకీయ కక్షతోనే తన భార్యకు కూడా నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అవసరమైతే మళ్లీ విచారణకు హాజరవుతానని, దర్యాప్తుకు ఎల్లప్పుడూ సహకరిస్తానని స్పష్టం చేశారు. మరోవైపు కేసు దర్యాప్తు కొనసాగుతోందని సిఐడి వర్గాలు వెల్లడించాయి.

# చెరువులను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతాం
### హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మాధాపూర్‌లోని తమ్మిడికుంట, సున్నం చెరువుల పునరుద్ధరణ పనులను హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ శనివారం అధికారులతో కలిసి పరిశీలించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ చెరువులను రెండు నెలల్లోగా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. తమ్మిడికుంటను ఐటీ హబ్ సమీపంలో ఒక గొప్ప పర్యాటక కేంద్రంగా మార్చాలని, అక్కడ ఉష్ణోగ్రత తక్కువగా ఉండేలా పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు. చెరువుల చుట్టూ వాకింగ్ ట్రాక్లు, సీటింగ్ ఏర్పాట్లు, పచ్చిక బయళ్లు ఏర్పాటు చేయనున్నారు. చెరువుల పరిధిలోని ప్రభుత్వ భూములను అంగుళం కూడా పోకుండా స్వాధీనం చేసుకోవాలని, ఆక్రమణదారుల పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. సున్నం చెరువు సమీపంలో మురుగు నీరు నిలవకుండా డైవర్షన్ కాలువ పనులను పూర్తి చేయాలని, స్థానిక బస్తీ ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

## పాత లేఅవుట్లలోని ప్లాట్ల జోలికి వెళ్లం : హైడ్రా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యుఎల్‌సి) భూముల్లో వెలసిన పాత లేఅవుట్ల విషయంలో ప్రజలు ఆందోళన చెందవద్దని హైడ్రా స్పష్టం చేసింది. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. పాత లేఅవుట్లలో ఇళ్లు ఉన్నా, రెగ్యులరైజ్ కాని ఖాళీ ప్లాట్లు ఉన్నా వాటిని హైడ్రా కూల్చివేయదు. హైడ్రా పేరు చెప్పి ప్లాట్లను ఆక్రమించేందుకు ప్రయత్నించే వారిని నమ్మవద్దని, ఏదైనా సందేహం ఉంటే నేరుగా హైడ్రా కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించింది. లేఅవుట్లలోని పార్కులు, రహదారులు, ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాలు ఆక్రమణకు గురికాకుండా చూడటమే హైడ్రా ప్రధాన లక్ష్యమని పేర్కొంది. కొండాపూర్, హైదర్ నగర్ వంటి ప్రాంతాల్లో కేవలం పార్కులు, రోడ్ల ఆక్రమణలను మాత్రమే తొలగించినట్లు సంస్థ గుర్తు చేసింది.

## ఉపాధిహామీ చట్టాన్ని బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది
### సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం

**ప్రజాపక్షం/కొణిజర్ల :** కొట్లాడి తెచ్చుకున్న ఉపాధిహామీ చట్టాన్ని బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని, ఇలాంటి చర్యలు మానుకోవాలని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతురావు అన్నారు. మండల పరిధిలోని చిన్నమునగాలలో శనివారం సిపిఐ సీనియర్ నాయకుడు పాపగంటి గురువయ్య సంస్మరణ సభలో బాగం హేమంతురావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండు సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు వామపక్ష కమ్యూనిస్టు పార్టీలు పార్లమెంట్ సభ్యులుగా భాగస్వామ్యులుగా ఉండి యుపిఎ ప్రభుత్వంలో పోరాడి వ్యవసాయ కార్మికులకు అవసరమైన గ్రామీణ ఉపాధిహామీ చట్టాన్ని తీసుకువస్తే దానిని ఎత్తివేసేందుకు కేంద్రప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు.

# ఆహార వ్యాపారంపై 'గ్యాస్' దెబ్బ

### సరఫరా లేని వాణిజ్య గ్యాస్‌బండలు
### మూతపడుతున్న చిన్న చిన్న హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు
### సంక్షోభంలో స్టార్ హోటళ్లు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఇరాన్, అమెరికాల మధ్య యుద్ధ ప్రభావం ప్రజలపై పడుతుంది. క్రమేపి ధరలు పెరగడంతో పాటు ఇతరత్రా నిత్యావసర వస్తువుల కొరత ఏర్పడుతుంది. 'ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చినట్లు' ఇప్పుడు యుద్ధం కారణంగా విపరీతమైన గ్యాస్ కొరత ఏర్పడింది. గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ల కొరతతో పాటు వాణిజ్య అవసరాలకు వినియోగించే గ్యాస్‌బండలు దొరకకపోవడంతో ఆహార వ్యాపారంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఒక్క ఖమ్మం నగరంలోనే ప్రతి రోజు రూ. 50 లక్షల నుంచి రూ.70 లక్షల ఆహార వ్యాపారం జరుగుతుంది. స్టార్ హోటళ్లు మొదలు చిన్న చిన్న హోటళ్లు, టీ స్టాల్స్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్స్ గ్యాస్ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. వాణిజ్య గ్యాస్ అందుబాటులో లేకపోవడంతో గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్‌ను వినియోగిస్తున్నారని మరో పక్క అధికారులు పెద్ద ఎత్తున దాడులు చేస్తున్నారు. దీనితో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు చిన్న చిన్న హోటళ్లు మూసి వేస్తుండగా స్టార్ హోటళ్లు సైతం తీవ్ర గ్యాస్ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. యుద్ధానికి ముందు వివిధ గ్యాస్ కంపెనీలు ఇంటింటికి తిరిగి గ్యాస్‌ను సరఫరా చేసేవి. ఇందుకు పూర్తి విరుద్ధంగా ప్రస్తుత పరిస్థితి ఉంది. ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకుంటేనే గ్యాస్‌ను సరఫరా చేస్తామని గ్యాస్ డీలర్లు చెబుతున్నారు. ఎంత ప్రయత్నించినా గ్యాస్ ఆన్‌లైన్ ద్వారా బుక్ కావడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. ఒక్కొక్కసారి ఆన్‌లైన్‌లో స్పందన వచ్చినప్పటికీ డెలివరీ డేట్ సరిగ్గా ఉండడం లేదని వారం నుంచి 10 రోజులు పడుతుందని వినియోగదారులు వాపోతున్నారు. ఇంటింటికి తిరిగి గ్యాస్ సరఫరా చేయడంతో చాలా మంది గ్యాస్ వినియోగదారులు తమ పేరును రిజిస్ట్రేషన్ చేసుకుని పాస్‌పుస్తకాలు తీసుకోలేదు. తీసుకోవాల్సిన అవసరం కూడా రాలేదు. ఇంటి వద్దనే డబ్బులు చెల్లిస్తే గ్యాస్ సరఫరా చేయగా ఇప్పుడు ఆన్‌లైన్‌లో బుక్ చేయాలి అన్న నియమంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. వాణిజ్య అవసరాలకు సంబంధించి కోరిన వెంటనే గ్యాస్ సరఫరా చేసేవారు. ఇప్పుడు గ్యాస్ కొరత ఏర్పడడంతో వాణిజ్య బండల సరఫరాలో తీవ్ర జాప్యం జరుగుతుంది. ఒక చిరు హోటల్ యజమాని మాట్లాడుతూ తనకు నాలుగు రోజులకు ఒక గ్యాస్ బండ సరిపోతుందని కానీ 15 రోజులుగా వాణిజ్య గ్యాస్ సరఫరా లేకపోవడంతో గడిచిన వారం రోజుల నుంచి హోటల్ మూసివేశానని తెలిపారు. ఖమ్మం నగరంలో చాలా ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు మూతపడ్డాయి. చిన్న చిన్న హోటళ్లు కూడా మూతపడే దిశలో ఉండగా కొన్ని ఇప్పటికే మూసివేశారు. హోటళ్ల మూత కేవలం వ్యాపారికి సంబంధించిందే కాకుండా ఆహార వ్యాపారంపై ఆధారపడి జీవించే పలువురు కార్మికులు ఉపాధి కోల్పోతున్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆహార వ్యాపారంపై ఆధారపడి ఒక ఖమ్మం జిల్లాలోనే 50వేల మంది జీవిస్తున్నారు. ఒక్కొక్కరుగా ఉపాధి కోల్పోతున్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి వాణిజ్య గ్యాస్ కొరత లేకుండా సరఫరా చేయాలని ఆహార వ్యాపారులు కోరుతున్నారు. ఈ విషయమై అధికారులను సంప్రదించగా సోమవారం నుంచి పూర్తి స్థాయిలో వాణిజ్య గ్యాస్ అందుబాటులోకి రానుందని తెలిపారు. మొత్తంగా గ్యాస్ కొరతను నివారించి వ్యాపార వర్గాలకు అందుబాటులో ఉండేవిధంగా చూడాలని కోరుతున్నారు.



## పాలన గాలికి వదిలేసి
# ఇతర రాష్ట్రాల్లో ముఖ్యమంత్రి ప్రచారం
### బిజెపి నేత డాక్టర్ బూర నర్సయ్య గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిస్థితి ప్రస్తుతం ఇంట్లో జీరో బయట హీరో అన్నట్లుగా ఉందని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ అన్నారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పాలన గాలికి వదిలేసి, ఇతర రాష్ట్రాల్లో ప్రచారానికే ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. మాటల్లో, మూటల్లో హీరోగా మారిన సిఎం, అభివృద్ధిలో మాత్రం జీరో అని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టివేసిందని, కేవలం 28 నెలల్లోనే రూ.3 లక్షల 47 వేల కోట్ల అప్పు చేసి రికార్డు సృష్టించిందని ఆరోపించారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం 365 రోజుల్లో 363 రోజులు అప్పులతోనే గడిపిందన్నారు. ఇదొక రోజువారీ కూలీ ప్రభుత్వంలా మారిందన్నారు. అప్పులు చేసి ఢిల్లీకి, ఇతర రాష్ట్రాల ఎన్నికలకు మూటలు పంపుతున్నారని ఆరోపించారు.

# ఆస్తి పన్నుపై 5 శాతం రాయితీ
### ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) పరిధిలోని ఆస్తి యజమానులకు కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి తీపి కబురు అందించారు. 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్నును ముందస్తుగా చెల్లించే వారి కోసం 'ఎర్లీ బర్డ్' పథకాన్ని అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. మొత్తం ఆస్తి పన్నుపై 5 శాతం ప్రత్యేక రాయితీ లభిస్తుంది. ఏప్రిల్ 30, 2026 లోపు పన్ను చెల్లించిన వారికి మాత్రమే ఈ అవకాశం ఉంటుంది. ఈ పథకం నివాస గృహాలతో పాటు వాణిజ్య ఆస్తులకు కూడా వర్తిస్తుంది. అయితే, పాత బకాయిలు లేదా వడ్డీలపై ఎటువంటి రాయితీ ఉండదు. పౌరులు mmc.telangana.gov.in వెబ్‌సైట్ లేదా 'MyCURE' మొబైల్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చు. మీసేవా లేదా పౌర సేవా కేంద్రాలను సంప్రదించవచ్చు అని కమిషనర్ వివరించారు. నగర అభివృద్ధి పనులకు సహకరించేలా పౌరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.



# నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు
### క్షేత్రస్థాయి పర్యటనలో ఎంఎంసి కమిషనర్ హెచ్చరిక

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి శనివారం ఉప్పల్, నారపల్లి తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా 29వ రోజు ఆయన అధికారులతో కలిసి పలు అభివృద్ధి పనులను సమీక్షించారు. ఫ్లైఓవర్ నిర్మాణ పనులను పరిశీలించిన కమిషనర్, నాణ్యతతో పాటు పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించే భవనాలపై కఠిన చర్యలు ఉంటాయని, సెట్ బ్యాక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని హెచ్చరించారు. వాణిజ్య సంస్థలు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రాంథాపూర్ ప్రాంతంలో స్వయం సహాయక సంఘాల మహిళలను కలిసి, వారి నైపుణ్యాలను ప్రశంసించారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వ పథకాలను వాడుకోవాలని సూచించారు.

# బాబు జగ్జీవన్ రామ్ సమానత్వానికి ప్రతీక
### మంత్రి లక్ష్మణ్ కుమార్

**ప్రజాపక్షం /హైదరాబాద్ :** సమానత్వానికి ప్రతీక , సామాజిక న్యాయానికి చిరునామా బాబు జగ్జీవన్‌రామ్ అని సంక్షేమ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కొనియాడారు. బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా మంత్రి నివాళ్లు అర్పించారు. దేశ రాజకీయాల్లో అజరామరమైన ముద్ర వేసిన మహానేత బాబు జగ్జీవన్ రామ్‌అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం చేసిన సేవలు చిరస్మరణీయమైవి అన్నారు. ఆయన ఆలోచనలను స్మరించుకుంటూ, సమానత్వ సమాజ నిర్మాణానికి సంకల్పించుకుని ముందుకు సాగుతామని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రేమ, శాంతి, పునర్జన్మకు ప్రతీక అయిన ఈస్టర్ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకుమంత్రి లక్ష్మణ్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రభుత్వం బలవంతపు భూసేకరణ తక్షణమే అపాలి

గ్రీన్ ఫిల్డ్ రోడ్డు నిర్మాణ బాధితుల సమస్యలను పరిష్కరించాలి



**ప్రజాపక్షం/యాచారం :** ప్రభుత్వం బలవంతపు భూసేకరణ తక్షణమే అపాలని గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణ భాదితులు డిమాండ్ చేశారు. గ్రీన్ ఫిల్డ్ రోడ్డు నిర్మాణ భాదితులు చేస్తున్న రిలే నిరహర దీక్షలు 19వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రైతులను ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేసి భూసేకరణ చేయాలని చూస్తే సహించేది లేదని రైతులు హెచ్చరించారు. ఇప్పటికే ఫార్మాసిటి పేరుతో నిరుపేదల భూములు కారు చౌకగా తీసుకోని రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. కోర్టులో భూసేకరణ చేయవద్దని ఉత్తర్వులు ఉన్న ప్రభుత్వం పట్టి పట్టనట్లుగా వ్యహరిస్తుందని అగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతులు ఇబ్బందులకు గురి చేయాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఫార్మసిటికి రైతులను మోసం చేసి భూములు బలవంతగా తీసుకున్నారు. ఇప్పుడు గ్రీన్ రోడ్డు నిర్మాణలో గిరిజన రైతుల భూములు తీసుకోవాలని ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తుందని అగ్రహం వ్యక్తం చేశారు. బలవంతగా ప్రభుత్వం భూసేకరణ చేస్తే గిరిజన రైతులందరం కలిసి అడ్డుకుంటామని హెచ్చరించారు. దాదాపు 19 రోజులుగా గిరిజన రైతులు రిలే నిరహర దీక్షలు చేస్తున్న ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు అయిన కావడం లేదని రైతులు అవేదన వ్యక్తం చేశారు. మా భాదలు అర్థం చేసుకోని మాకు న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణం భాదితులు పాల్గోన్నారు.

## 'హోప్' ఫౌండేషన్ సేవలు భేష్



**ప్రజాపక్షం/మియాపూర్:** హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్ సేవలు భేష్ అని, సమాజాన్ని తనవంతుగా కొంత సేవ చేయాలనే మానవత దృక్పథంతో అన్న దానంతో పాటు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వారికి ఈ సందర్బంగా అభిమానులు అభినందనలు తెలిపారు. హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరవహిస్తున్న అన్న దాన కార్యక్రమంలో భాగంగా శనివారం నిర్వహించిన 178వ వారం అన్న ప్రసాదం హోప్ చైర్మన్ కొండ విజయ్ కుమార్ ప్రజలకు వడ్డించారు. ఈ కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా సరస్వతి దేవి విగ్రహావిష్కరణ



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** సాహెబ్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకులు రవీంద్ర, యండూరి వెంకట సుదర్శనరావు చేతుల మీదుగా శ్రీ సరస్వతి దేవి విగ్రహను శనివారం ఆవిష్కరించారు. జాగృతి అభ్యుదయ సంఘం, వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్ వనస్థలిపురం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహంను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ సరస్వతి నిలయమైన పాఠశాలలో దాతల సహాయంతో శ్రీ సరస్వతి మాత విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు చక్కని పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యయులు దినేష్, ఏఏపిసి చైర్మన్ బి. మమత, జాగృతి అభ్యుదయ సంఘం అధ్యక్షులు భవన శ్రీనివాస్, చిత్తలూరి వేణుమాధవ్, గోపాల్‌దాస్, రామలింగేశ్వరరావు, శ్రీరాములు గౌడ్, సత్యనారాయణ, వాసవి క్లబ్స్ జిల్లా ప్రతినిధులు అల్లాడి పరమేశ్వర్, స్వామి, రవీందర్‌రెడ్డి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమానికి నిరంతరం కృషి



**ప్రజాపక్షం/షాబాద్:** కొమరబండ గ్రామ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు సర్పంచ్ పద్మా గోపాల్ అన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని కొమరబండ గ్రామంలో పట్నం మహేందర్ రెడ్డి మెడికల్ కళశాల ఆధ్వర్యంలో కొమరబండ గ్రామంలో ఉచిత వైద్య శిభిరం నిర్వహించిన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని చాల మందికి ఉచిత వైద్య పరిక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పద్మాగోపాల్ మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. గ్రామంలో అందరూ ఆరోగ్యంగా ఉండాలని పట్నం మహేందర్ రెడ్డి సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. గ్రామ ప్రజలకు ఇచ్చిన హమీలను దశల వారిగా అమలు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శేఖర్, వార్డు సభ్యులు, వైద్య అధికారులు, గ్రామస్తులు ఉన్నారు.

## హోంగార్డుకు ఘన సన్మానం చేసిన ఎల్‌బినగర్ పోలీస్ సిబ్బంది

**ప్రజాపక్షం/హయత నగర్ :** ఎల్‌బినగర్ పోలీస్ స్టేషన్‌లో గత పది సంవత్సరాలుగా హోంగార్డ్‌గా పనిచేసి బదిలీపై వెళ్తున్న హోమ్ గార్డ్ నాగేశ్వర్ రావుకు ఘనంగా సన్మానము చేసిన ఎల్‌బినగర్ పోలీస్ సిబ్బంది , కె.నాగేశ్వరరావ్ తన కృషి, నిజాయితీ, అంకితభావంతో మనందరి హృదయాల్లో ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకున్న సహోద్యోగి బదిలీపై వెళ్ళడం మనకు కొంత బాధ కలిగించినా ఆయన ఎక్కడ పనిచేసినా, అక్కడ కూడా తన ప్రతిభతో, కృషితో మంచి పేరు తెచ్చుకుంటారని మనం హృదయపూర్వకంగా కోరుకుంటున్నాము అని సిఐ వినోద్ కుమార్ అన్నారు . భవిష్యత్తులో ఆయనకు మంచి ఆరోగ్యం, ఆనందం, మరిన్ని విజయాలు కలగాలని కోరు కుంటూ తోటి ఉద్యోగులతో కలిసి ఘనంగా సన్మానించారు.



# నీటిని పొదుపుగా వాడుకోవాలి

ప్రజలకు జలమండలి ఎండి అశోక్‌రెడ్డి విజ్ఞప్తి




**ప్రజాపక్షం/సిటీబ్యూరో:** భూగర్భ జలాలు అడుగంటిన నేపథ్యంలో ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని జలమండలి ఎండి అశోక్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వేసవి నేపథ్యంలో క్యూర్ పరిధిలో తాగునీటి సరఫరా, ఇతర అంశాలపై శనివారం ఆయన ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో ట్రాన్స్‌మిషన్, క్యూఏటీ అధికారులతో సమీక్ష నిర్వహించి వివిధ అంశాలపై కూలంకషంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పంపింగ్ స్టేషన్‌లు, నీటిశుద్ధి కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది హాజరు సంబంధించిన వివరాలను ఉన్నతాధికారులు పర్యవేక్షించాలన్నారు. పంపింగ్ స్టేషన్లు, నీటిశుద్ధి కేంద్రాల్లో రక్షణ వ్యవస్థను పటిష్ఠం చేయడానికి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి ప్రాంగణంలో సీసీ కెమెరాలను అమర్చి పర్యవేక్షించాలని తెలిపారు. క్యూర్ పరిధిలో ఎక్కడా తాగునీటి కొరత ఉండొద్దని, కలుషిత నీటి సరఫరా సమస్యలు తలెత్తిన చోట్ల ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. ట్యాంకర్లు బుక్ చేసుకున్న వారికి సాధ్యమైనంత వేగంగా సరఫరా అయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. వేసవి నేపథ్యంలో నగరంలో అన్ని ప్రాంతాల్లో కేటాయించిన మేరకు నీటి సరఫరా చేయాలని ట్రాన్స్‌మిషన్ అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరా, నీటి కొరత, లోప్రెజర్ సమస్యలపై వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ట్రాన్స్ మిషన్, ఓ అండ్ ఎమ్ విభాగాల సమన్వయం కోసం ప్రధాన కార్యాలయంలో ఇరు విభాగాల మధ్య నీటి పంపిణీని పర్యవేక్షణ, సమస్యల పరిష్కారానికి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలన్నారు.వేసవిని దృష్టిలో పెట్టుకుని డిమాండును అంచ నా వేసి నీటి సరఫరాకు ప్రణాళికలు వేసుకోవాలన్నారు. ప్రతి జిఎం.. సక్రమ నీటి సరఫరాకు ట్రాన్స్‌మిషన్ అధికారుల సమన్వయంతో ఇన్ ఫ్లోను పర్యవేక్షించాలని తెలిపారు. తాగునీటి స రఫరా సమయాల్లో నీటిని ఇతర అవసరాలకు ఉపయోగిస్తే జరిమానాలు విధించడంతో పా టు.. మరికొంత మంది మోటార్లతో నీటిని తోడుతున్న ప్రాంతాల్లో లోప్రెజర్ సమస్యలు వస్తున్నాయని.. వీటిని నివారించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమీక్షలో రీజియన్ల ఇడిలు పంకజ, సంతోష్, టెక్నికల్ డైరెక్టర్ సుదర్శన్, ఆపరేషన్ డైరెక్టర్లు వినోద్ భార్గవ, నారాయణ, శ్రీనివాసరెడ్డి, సిజిఎంలు, జిఎంలతో పాటు ఐటీ, ట్రాన్స్ మిషన్ అధికారులు పాల్గొన్నారు

## పట్నం మున్సిపల్ చైర్మన్‌గా టేకుల సుదర్శన్ రెడ్డి

వైస్ చైర్మన్‌గా ముత్యాల శ్యామల ఎన్నిక

**ప్రజాపక్షం/ ఇబ్రహీంపట్నం :** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని బిఆర్ఎస్ అభ్యర్థి టెకుల సుదర్శన్ రెడ్డి,వైస్ చైర్మన్‌గా బిజెపి అభ్యర్థి ముత్యాల శ్యామల ఎట్టకేలకు కైవసం చేసుకున్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికలను అధికారులు నల్లగొండ జిల్లా మిర్యాలగూడ సబ్ కల్లెక్టర్ నారయాణ హైమత్, జెడ్‌పి సిఇఒ క్రిష్టరెడ్డిలు ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించినట్లు అధికారికంగా ప్రకటించారు. ఇబ్రహీంపట్నం మున్సిపల్‌లో మొత్తం 24 వార్డులు ఉండగా అందులో బిఆర్ఎస్13, కాంగ్రెస్8, బిజెపి2, స్వతంత్ర అభ్యర్థి1 కౌన్సిలర్లగా గెలుపొందారు. అయితే పట్నం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక గత ఫిబ్రవరి నెల 16,17వ తేదిలలో జరుగాల్సి ఉండగా 19వ వార్డు సభ్యులు ఆకుల యాదగిరిని కిడ్నాప్ చేశారని కుటుంబ సభ్యులు ఆరోపించి హైకోర్టును ఆశ్రయించటంతో రెండు సార్లు మున్సిపల్ ఎన్నికలు వాయిదా పడింది. నాటి నుండి నేటి వరకు సుమారు 50రోజల పాటు బిఆర్ఎస్ కౌన్సిలర్లు క్యాంపు నిర్వహించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించటంతో మున్సిపల్ ఎన్నికల సమావేశానికి ముందుగా స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో పాటు 8 మంది కాంగ్రెస్ కౌన్సిలర్లు హాజరై కోర్టులో మూడు సంఘటనలపై వివాదం కొ నసాగుతుందని ఎన్నికల అధికారులకు సూచించి సమావేశం నుండి కాంగ్రెస్ అభ్యర్థులు బహిష్కరించి ఎన్నికను వాకౌట్ చేశారు. బిఆర్ఎస్ పార్టీకి మోజార్టీ కోరం ఉండటంతో ఎన్నికల చైర్మన్,వైస్ చైర్మన్ ఎన్నికను ప్రశాంతంగా సభ్యు లు ఎన్నుకున్నా టరు. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక సుధీర్ఘ నిరిక్షణకు తెర పడటంతో అధికారులు, పోలీసులు ఊపిరి పిల్చుకున్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్,వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రీయ భారీ పోలీస్ బందొబస్తు మధ్య నిర్వహించారు.

## బిసి రిజర్వేషన్ల అమలులో బిజెపి కాంగ్రెస్‌లకు చిత్తశుద్ధి లేదు

తెలంగాణ శాసన మండలి వైస్ చైర్మన్ బండ ప్రకాష్

**ప్రజాపక్షం/హయత్‌నగర్ :** బిసి రిజర్వేషన్లల మీద బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు చిత్తశుద్ధి లేదు అని తెలంగాణ శాసన మండలి వైస్‌చైర్మన్ బండ ప్రకాష్ విమర్శించారు. బిసి రాజ్యాధికార వేదిక అధ్యక్షుడు ఐతగోని రాఘవేంద్ర గౌడ్ ఆధ్వర్యంలో శనివారం ఎల్బీనగర్ పరిధిలోని చింతలకుంట ప్రణవి గార్డెన్స్‌లో బిసి ఆత్మ గర్జన సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ శాసన మండలి వైస్ చైర్మన్ బండ ప్రకాష్ మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వంలో ఇప్పటి వరకు బిసిలకు మంత్రిత్వ శాఖ లేకపోవడం శోచనీయం అని అన్నారు. రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం బిసిల మీద కపటప్రేమ చూపిస్తుందని అసంబ్లీలో రిజర్వేషన్ల బిల్లు పెట్టి చేతులు దులుపుకుందని విమర్శించారు. బిసిలు కలిసి కట్టుగా ఉండి రాజ్యాధికారం చేపట్టాలి అని కోరారు. బిసి సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపి ఆర్. క్రిష్ణయ్య మాట్లాడుతు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం బిసి రిజర్వేషన్ల పట్ల సానుకూలంగా ఉందని అన్నారు. బిసిలు రాజకీయంగా ఎదిగినపుడే బిసిలు అభివృద్ధి చెందుతారన్నా రు. బిసి రాజ్యాధికార వేదిక అధ్యక్షు డు ఐతగాని రాఘవేంద్ర గౌడ్ మాట్లాడుతూ బిసి రాజ్యాధికారమే ధ్యేయం అని అన్నారు. సుమారు 6 దశాబ్దాలుగా బిసిలు రిజర్వేషన్ కోసం సబ్ ప్లాన్ కోసం కార్పొరేషన్ల కోసం విధుల కోసం రోడ్డెక్కిన సమస్యలు పరిష్కారం కాలేదని.

ఇకపై పొలిటికల్ పవర్ కోసం బిసి రాజ్యాధికా ర వేదిక పనిచేస్తుంది. బిసిలకు రాజకీయ అధికారం రావాలనే ఉద్దేశంతో బిసి ఆత్మగజం సభ నిర్వహించాం అని తెలిపారు. ఈ కా ర్యక్రమంలో బిసి కులాల నాయకులు రిటైర్డ్ ఐఎఎస్ చిరంజీవులు నారగోని, పల్లె రవి, వెంకటేష్ గౌడ్, పొన్నం ధన్‌రాజ్, కూహం సత్యనారాయణ, గుజ్జ సత్యం తదితరులు పాల్గొన్నారు.

## మాదాపూర్ సింధు ఆసుపత్రిలో మాక్ డ్రిల్

**ప్రజాపక్షం /హైదరాబాద్ :** మాధాపూర్‌లోని సింధు ఆసుపత్రిలో మాక్ డ్రిల్, ఎవాక్యువేషన్ డ్రిల్, ఫైర్ ఫైటింగ్ డ్రిల్స్ విజయవంతంగా నిర్వహించినట్లు అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ కార్యక్రమాలు నిర్వహించారు. తె లంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ, సివిల్ డిఫెన్స్ శా ఖ ఆధ్వర్యంలో '99 డేస్



ప్రజా పాలన విజయోత్సవాలు'లో భాగంగా ఈ డ్రిల్స్ చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు. ఆసుపత్రి సిబ్బంది, వైద్యులు, నర్సులు, హౌస్కీపింగ్, భద్రతా సి బ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో స మర్థవంతమైన స్పందన, భద్రతా అవగాహన పెంపు, ఎవాక్యువేషన్ విధానాలపై శిక్షణ అందించడమే ఈ డ్రిల్స్ ముఖ్య ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఫైర్ ఆ ఫీసర్ షేక్ ఖాజా కరీముల్లా పర్యవేక్షించగా, అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ జె. గోవర్ధన్ రెడ్డి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్లు పి. అంజనేయులు, పి. ప్రశాంత్, ఎన్. శ్రీకాంత్, పి. కమలాకర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఆసుపత్రిలో అత్యవసర పరిస్థితులపై సిద్ధతను మరింత బలోపేతం చేసిందని అధికారులు తెలిపారు.

## పేదలకు వరంగా మారుతున్న సిఎంఆర్ఎఫ్ నిధులు

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి

**ప్రజాపక్షం/కొందుర్గు:** ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరంగా మారుతుందని, వైద్య పరంగా ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం కొందుర్గు మండల పరిధిలోని తంగేళ్ళపల్లి గ్రామంలో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. మండల పరిధిలోని సోమారంపాడ్ గ్రా మానికి చెందిన నరసింహారెడ్డికి, కొందుర్గు గ్రామానికి చెందిన గుండమల్ల జగదీశ్వర్ గౌడ్, అయోధ్యపూర్ తండా చెందిన కేతావత్ సక్రి, వెంకిర్యాల గ్రామానికి చెందిన మోత్కూరి చంద్రయ్య, పత్తి నవీన్‌లకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వచ్చిన చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఎ మ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వైద్యపరంగా పేదలను అదుకునేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. వైద్యకోసం ఖర్చు చే యలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న గ్రామీణ పేదలకు వరంగా మా రందని, దరఖాస్తులు చేసుకున్న ప్రతి లబ్ధిదారుడికి ఆర్థిక సహయం అందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి రాజేష్ పటేల్, రామకృష్ణ, మహదేవ్‌పూర్ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.



## ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దురాక్రమణ యుద్ధాన్ని వ్యతిరేకిద్దాం



కరపత్రం విడుదల చేసిన ప్రజా సంఘాల నేతలు

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ప్రపంచ శాంతికోసం ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దురాక్రమణ యుద్ధాన్ని వ్యతిరేకిద్దామని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం షాద్‌నగర్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నేతలు మాట్లాడుతూ ఇజ్రాయెల్, అమెరికా దేశాలు ఇరాన్ మీద అక్రమణ యుద్ధం ప్రారంభించి ప్రపంచ ప్రజల జీవితాలతో చెలగాట మాడుతున్నాయని మండిపడ్డారు. సామ్రాజ్యవాద యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ ప్రపంచ ప్రజల శాంతి కోసం జరిగే సదస్సును విజయవంతం చేయాలని కోరారు. అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు వనరుల దోపిడి కోసం ప్రపంచం మీది ఆదిపత్యం కోసం పాఠశాలల, ఆసుపత్రుల మీద జనావాసాల మీద దాడులు చేస్తున్నాయని వివరించారు. యుద్ధాన్ని ప్రాణాంతక సమస్యగా విధ్వంసంగా ఒక సరదా క్రీడలాగా భావిస్తున్నాయని ఇజ్రాయెల్ పాలస్తీలను ఊచకోత కోసిందని, దానికి అమెరికా మద్దతు ఇస్తుందని, ఈ రెండు దేశాలు కలిసి ఇరాన్‌పై దాడులు చేస్తున్నారని వివరించారు. మూడు దేశాలే కాకుండా రష్యా, ఉక్రెయిన్ మీద యుద్ధం చేస్తుందని యావత్తు ప్రపంచ భీభత్స పర్యవసనాలు అనుభవించక తప్పని పరిస్థితి యుద్ధోన్మాద దేశాలు కల్పిస్తున్నాయని, ఈ యుద్ధాన్ని వ్యతిరేకించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. యుద్ధాన్ని వ్యతిరేకించాల్సిన భారతదేశం ఎందుకు వెనుకబడి పోతుందని, ఇజ్రాయెల్ పాలస్తినా మీద హింసకాండను ఇరాన్ మీద అమెరికా ఇజ్రాయెల్ చేస్తున్నటువంటి హింసకాండను భారత ప్రభుత్వం ఎందుకు ఖండించడం లేదని నిలువరించే కృషి ఎందుకు చేయలేకపోతుందన్నారు. యుద్ధ ప్రభావం ప్రపంచ ప్రజలపై ప్రభావం చూపిస్తుందో అనే అంశాలపై మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే సదస్సుకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు టిజి శ్రీనివాస్, పాలమూరు అధ్యాయన వేదిక నాయకులు రవీంద్రనాథ్, యూటిఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సింలు, యూటిఎఫ్ నాయకులు బిజిలి సత్యం, వలిగే కృష్ణ, పౌర హక్కుల సంఘం నాయకులు తిరుమలయ్య, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనింగ్ కమిటి సభ్యులు మిద్దెల సత్యనారాయణ, గిరిజన సంఘం నాయకులు ఈశ్వర్‌నాయక్, యూటిఎఫ్ నాయకులు బాలయ్య, కృష్ణయ్య, కురుమూర్తిలు పాల్గొన్నారు.

## రేడియల్ రోడ్డు భూ బాధితులకు న్యాయం చేస్తాం

జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి

**ప్రజాపక్షం/షాబాద్:** రేడియల్ రోడ్డు భూ బాధితులకు న్యాయం చేస్తామని జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి అన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని నాగర్‌కుంట, మాచన్‌పల్లి, సంకెపల్లిగూడ, బోనగిరిపల్లి గ్రామాల రైతులకు ఆయా గ్రామ పంచాయతీలో వేరు వేరుగా అవగహన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం చేవెళ్ల ఆర్‌డిఒ పార్థసింహారెడ్డి రెడ్డి,హెచ్ఎండిఎ అధికారులు అర్చన, తహశీల్దార్ అన్వర్‌తో కలిసి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి మాట్లాడుతూ.. రేడియల్ రోడ్డు రావడంతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం చాల మంది రైతులు ప్రభుత్వ ఆదేశాలను స్వీకరించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా గ్రామ సభలో నాగర్‌కుంట సర్పంచ్ పాలమాకుల మల్లయ్య మాట్లాడుతూ.. రేడియల్ రోడ్డు భూ బాధితులకు భూమికి భూమి, 500 గజాల ప్లాటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చాల మంది నిరు పేద రైతులు ఉన్నారని అధికారులకు వివరించారు. సభలో అధికారులు స్పందించి రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్తాం అన్నారు. ప్రభుత్వం తరపున రైతులకు న్యాయం జరిగేవిధంగా చూస్తామని హమీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కుంట ఉప సర్పంచ్ బుగ్గరాములు, సంకెపల్లిగూడ సర్పంచ్ కుమ్మరి లావణ్య చెన్నయ్య, వివిధ గ్రామాల వార్డు సభ్యులు పంచాయతీ కార్యదర్శులు, ఆర్ఐ ఖాజ, విజయ్, జిపిఒలు రాజు సుధాకర్, నరహరి తదితరులు ఉన్నారు. రేడియల్ రోడ్డు భూ బాధితులకు న్యాయం జరిగేవరకు పోరాటం చేస్తామని సిపిఐ మండల పార్టీ అధ్యక్షుడు పాలమాకుల శ్రీశైలం అన్నారు. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలిపారు. రైతులకు భూమికి బదులు భూమి, ఇంటి స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు.



## రాష్ట్రస్థాయిలో పంటల బీమా అమలు చేయాలి

కొంతం మాధవరెడ్డి

**ప్రజాపక్షం/కడ్తాల్ :** రాష్ట్రస్థాయిలో తక్షణమే పంటల బీమా పథకాన్ని రూపొందించు,ప్రకడ్బందీగా అమలు చేయాలని తెలంగాణ రైతు సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి అన్నారు.శనివారం రైతు సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆమనగల్లు మండలంలోని పెద్దతండ చిన్న తండా, రాంనుంతల, కొనాపూర్, ఆకుతోటపల్లి, జంగారెడ్డిపల్లి, మేడిగడ్డ తండతో పాటు ఆమనగల్లులలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సంపూర్ణ రూ.2 లక్షల రుణమాఫికాక, రైతు భరోసా నిధులు సమయానికి రాక,అప్పుల బాధలు తీవ్రమై ఇప్పటికీ నిరుపేద రైతులు ఆత్మహత్యలు చేసుకుంటూనే ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు.2 లక్షలకు పైగా అప్పులున్న రైతులకు ఎలాంటి కొర్రీలు పెట్టకుండా ఇప్పటికైనా తక్షణమే సంపూర్ణ రైతుల రుణమాఫీ చేయాలని,యూరియాను రైతులకు యాప్ ద్వారా అందించే విధానంలో లోపాలను సరిదిద్ది,సమయానికి సక్రమంగా సులభతరంగా పంటకు పరిపడా యూరియాను అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బి రామచంద్ర,విజయ్,కే నరేందర్ ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



## ఏప్రిల్ 25న తెలంగాణ రాజకీయాల్లో నూతన శకం

- కవిత నాయకత్వంలో కొత్త పార్టీ ఆవిర్భావం!
- శంకర్ పల్లిలో ఘనంగా రాజకీయ పార్టీ ఆవిర్భావ ప్రకటన పోస్టర్ విడుదల.
- తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి,రామిడి వెంకట్ రెడ్డి పిలుపు



**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** తెలంగాణ గడ్డపై మరో రాజకీయ ఉద్యమానికి నాంది పలుకుతూ, ఈనెల 25న ప్రకటించనున్న కొత్త రాజకీయ పార్టీ ఏర్పాట్లపై శంకర్ పల్లి మండల కేంద్రంలో భారీ సమీక్షా సమావేశం నిర్వహించారు. కొలాన్ కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి,మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రామిడి వెంకట్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా బిసి సెల్ అధ్యక్షుడు కె.శివశంకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు పార్టీ ఆవిర్భావ ప్రకటన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశం అనంతరం కప్పాటి పాండురంగా రెడ్డి, రామిడి వెంకట్ రెడ్డి సంయుక్తంగా విలేఖరులతో మాట్లాడుతూ తెలంగాణలోని సబ్బండ వర్గాల అభివృద్ధి, సామాజిక న్యాయమే లక్ష్యంగా, తెలంగాణ అస్తిత్వంతో ఈ పార్టీ పురుడుపోసుకోబోతోంది. తెలంగాణ ప్రజా గొంతుక కె.కవిత నాయకత్వంలో ఈ పార్టీ ప్రజల మద్దతుతో తిరుగులేని శక్తిగా ఎదగడం ఖాయం అనీ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వంతో ప్రతిపక్ష పార్టీలు కుమ్మక్కయ్యాయని, ప్రస్తుతం ఈ ప్రభుత్వంపై కవితక్క మాత్రమే ఒంటరి పోరాటం చేస్తున్నారని వారు ధ్వజమెత్తారు.

### మహిళల చేతుల్లోనే రాష్ట్ర భవిష్యత్తు

ఇది కేవలం ఒక రాజకీయ పార్టీ కాదని, ఇదొక మార్పు, ఒక గొప్ప ఉద్యమమని నాయకులు అభివర్ణించారు. ఇన్నాళ్లూ "అవకాశం ఇవ్వలేదు" అని బాధపడిన రోజులు పోయాయి, ఇకపై "అవకాశం తీసుకుంటాం" అని గర్జించే సమయం వచ్చింది. ఇంటి బాధ్యతలను మోసే ఆడబిడ్డ రాష్ట్రాన్ని కూడా అదే నిబద్ధతతో నడిపించగలదు. ఒక ఆడబిడ్డ ముందుకు వస్తే ఒక కుటుంబం మారుతుంది, వేలాది మంది ఆడబిడ్డలు కదిలితే రాష్ట్రం మారుతుంది. ఇది మహిళల కోసం, మహిళల చేతుల్లో మొదలవుతున్న నూతన రాజకీయపార్టీ. ఈనెల 25వ తేదీన మేడ్చల్, మునీరాబాద్‌లోని అద్వయ కన్వెన్షన్‌లో జరిగే నూతన రాజకీయ పార్టీ ప్రకటన సభను విజయవంతం చేయాలని వారు కోరారు. తెలంగాణ యువత,మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి కవితక్క నాయకత్వాన్ని బలపరచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జి.ప్రశాంత్ గౌడ్, సయ్యద్ ఇల్యాస్,నరేష్ గౌడ్,అనుదీప్ రెడ్డి, శ్రీకాంత్, కిషోర్, భాస్కర్ రెడ్డి,మణిదీప్, మనీ, చింటూ, ఎత్తరి గణేష్,గౌతమ్ రెడ్డి, వంశీ, గిరి, శెట్టి రాజు, రాయగంటి జగన్ తదితరులు పాల్గొన్నారు.



## పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే ధ్యేయం

### డిసిసి ఉపాధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:** పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయ్యమని ఆ దిశగానే అనేక అందుబాటులోకి తీసుకువచ్చినట్లు మేడ్చల్ మాల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ డిసిసి ఉపాధ్యక్షులు వేముల మహేష్ గౌడ్ అన్నారు. శనివారం ఘట్‌కేసర్ సర్కిల్‌లోని ఎదులాబాద్ 7వ డివిజన్ ఘనపూర్ ఫకీర్ తండాలో లబ్దిదారు ముడావత్ రోజా కిషన్ నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొని కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించి లబ్దిదారు కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలను అందించి అభినందించారు.ఈ సందర్భంగా వేముల మహేష్ గౌడ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతోపాటు ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభోత్సవం చేయడం ఎంతో సంతోషకరంగా ఉందని పేదల కళ్ళలో ఆనందం నింపడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నానావత్ రూప్ సింగ్ నాయక్, మాజీ ఉప సర్పంచ్ వేముల సత్తయ్యగౌడ్, కొమురవెల్లి దేవస్థానం ధర్మకర్త మెరుగు నరేష్ గౌడ్, గుర్జ కుంట నర్సింహా, తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే దిష్టి బొమ్మ దహనం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** చర్లపల్లి డివిజన్ బిజెపి ఆధ్వర్యంలో ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి దిష్టి బొమ్మను దగ్ధం చేశారు.కేంద్ర ప్రభుత్వం నిధులతో ఉప్పల్ టు నారపల్లి వరకు నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్‌కు రాజిరెడ్డి పేరు పెడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జిఓ సందర్భంగా కారిడార్‌కు అటల్ బీహరి వాజ్‌పాజ్ పేరు పెట్టాలని మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్ఎస్ అన్నారు. దీనికి వ్యతిరేకంగా ప్రభాకర్‌పై ప్రెస్‌మీట్ పెట్టి అనుచితవాఖ్యలు చేయడంతో దిష్టి బొమ్మను దగ్ధం చేసి ప్రభాకర్‌కు క్షమాపన చేప్పాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, దొమ్మాట నాధం, లక్ష్మణ్ గౌడ్,తాళ్ల ఆనంద్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



## అక్రమ నిర్మాణం కూల్చివేత

**ప్రజాపక్షం/చర్లపల్లి:** చర్లపల్లి డివిజన్ పరిధిలోని చర్లపల్లి ప్రధాన రహదారి రైల్వే కాలనీలో అక్రమంగా నిర్మాణం చేపట్టిన భవనాన్ని టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. అనుమతులు సరిగ్గా లేకుండా నిర్మించిన అక్రమ నిర్మాణానికి అనేకసార్లు నోటీసులు రెండు సార్లు సీజ్ చేశారు. టౌన్ ప్లానింగ్ అధికారులకు అనేకసార్లు నిర్మాణంపై ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడంతో మల్కాజ్‌గిరి మున్సిపల్ కమిషనర్‌కు ఇటీవల ఫిర్యాదు చేయడంతో స్పందించి అధికారులు, సిబ్బంది శనివారం షట్టర్లను తొలగించి గోడలను పోలీసులు సహకారంతో కూల్చివేశారు.

## బంగ్లాదేశ్ అక్రమ చొరబాటుదారులపై ఫిర్యాదు



**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ మున్సిపాలిటీ పరిధి గండి మైసమ్మ 120లో, గాగిలాపూర్ 214లో, మల్లంపేట్ 170 లో బంగ్లాదేశ్ అక్రమ చొరబాటుదారులు, రోహింగ్యా ముస్లింలు ఉన్నారని సమాచారం. అలాంటి వారి వల్లనే స్థానికంగా ప్రేరేపిత అల్లర్లు జరుగుతున్నాయనీ కావున పోలీస్ అధికారులు వెంటనే ఈ యొక్క ప్రాంతాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించి ఎలాంటి గుర్తింపు కార్డులులేని వారిని అరెస్ట్ చేయాలని దుండిగల్ మున్సిపాలిటీ బిజెపి తరఫున కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ బిజెపి అధ్యక్షులు పిసరి కృష్ణారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి దుండిగల్ విగ్నేశ్వర్ చారి, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు గోనే మల్లారెడ్డి, మున్సిపల్ ప్రధాన కార్యదర్శులు ధమ్మగారి సీతారామరెడ్డి, తురాయి భాను గౌడ్, సీనియర్ నాయకులు మల్లేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



## వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న చైర్ పర్సన్ శిరీష

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** కీసర దాయరలోని వెంకులోని గుట్ట కొండల్లో వెలిసిన స్వయంబూ శ్రీ వెంకటేశ్వర స్వామిని అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమ ఠం శిరీషా కృష్ణారెడ్డి శనివారం దర్శించుకున్నారు. అనంతరం వెంకులోని గుట్ట చైర్మన్ హన్మంతరెడ్డి చైర్ పర్సన్ శిరీషా దంపతులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అలియాబాద్ మున్సిపల్ కౌన్సిలర్‌లు గాదె వెంకటేష్, ఆలయ కమిటి సభ్యులు వంగ నర్సింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి, జహంగీర్‌రెడ్డి, గ్రామపెద్దలు, యాష్కి శంకర్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

# త్వరితగతిన భవన నిర్మాణ అనుమతులు

### సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భవన నిర్మాణ అనుమతులను త్వరితగతిన పూర్తి చేయాలని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సిఎంసి) కమిషనర్ సృజన అధికారులను ఆదేశించారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని టౌన్ ప్లానింగ్ విభాగంపై కమిషనర్ కార్పొరేషన్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించడంతో పాటు, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో పాటించాల్సిన విధి విధానాలపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశా రు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న అన్ని దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కమిషనర్ స్పష్టం చేశారు. భవన నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. విధి నిర్వహణలో పారదర్శకత పాటించాలని, ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నగరంలో వెలుస్తున్న అనధికార నిర్మాణాలు, ఆక్రమణలపై ఉక్కుపాదం మోపాలని అధికారులను ఆదేశించారు.

పోలీస్, ఇంజనీరింగ్, యుబిడి విభాగాలతో సమన్వయం చేసుకుంటూ దశలవారీగా ఆక్రమణలను తొలగించాలని స్పష్టం చేశారు. కోర్టు కేసులు, కోర్టు ధిక్కరణ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, వీలైనంత త్వరగా న్యాయపరమైన అడ్డంకులను తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**సమన్వయంతోనే ప్రగతి..**

క్షేత్రస్థాయిలో పనులు సమర్థవంతంగా అమలు కావాలంటే వివిధ విభాగాల మధ్య సరైన సమన్వయం ఉండాలని కమిషనర్ అన్నారు. అధికారులు నిరంతరం క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తూ పనులను పర్యవేక్షించాలని సూచించారు. ఎక్కడా జాప్యం జరగకుండా చూడాలని కోరారు. ఈ సమావేశంలో చీఫ్ సిటీప్లానర్ బి.వెంకన్న, కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఉన్నతాధికారులు,ఇతర విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఇంటింటి ప్రచారంలో సమస్యలను సేకరిస్తాం

### ఉప్పల్ నియోజకవర్గ సమితి కార్యదర్శి జి.దామోదర్‌రెడ్డి







**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** ప్రజలకు మరింత చేరువవడటం ద్వారా సిపిఐ పార్టిని కింది స్థాయి నుండి బలోపేతం చేసే లక్ష్యంగా ఇంటింటి ప్రచారం కొనసాగించాలని పార్టీ సిపిఐ ఉప్పల్ నియోజకవర్గ సమితి కార్యదర్శి జి.దామోదర్‌రెడ్డి, పిలుపిచ్చారు.

సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు శనివారం శక్తిసాయి నగర్ డివిజన్‌లోని గోకుల్‌నగర్, మల్లికార్జుననగర్, సాయినగర్, శక్తిసాయినగర్,సూర్యనగర్, బ్యాంక్‌కాలనీ ప్రాంతాల్లో ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల హక్కుల పరిరక్షణ, దోపిడీ, పీడన లేని వ్యవస్థ సాధన, సోషలిజం లక్ష్యంగా సిపిఐ అనేక పోరాటాలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రేషన్ కార్డు లు, పెన్షన్లు, గుడిసె వాసులకు పట్టాలు వంటి ప్రజా సమస్యలను సేకరిస్తామన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వివిఎస్ బోస్, ఉప్పల్ మండల కార్యదర్శి సత్యప్రసాద్, ధర్మేంద్ర, నర్సింహారావు, శక్తిసాయినగర్ డివిజన్ సిపిఐ నేతలు స్వప్న, రజిత, రేణుక, షహీన్, ఏఐఎస్ఎఫ్, ఎఐఎస్ఎఫ్ నేతలు గిరిబాబు, శేఖర్, అజీమ్, మహేష్, సమీర్, అలీ, బన్నో, సల్మాన్, యాసిన్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు అలసత్వాన్ని వీడాలి

### ఆదేశించిన బిఆర్ఎస్ ఎల్పి విప్ కెపి వివేకానంద



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** ప్రజలకు మెరుగైన మౌలిక వసతులను కల్పించడంలో అధికారులు అలసత్వం వహిస్తే సహించేది లేదని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద హెచ్చరించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ మున్సిపల్ సర్కిల్‌లో ఎమ్మెల్యే కెపి వివేకానంద పాద యాత్ర చేశారు. నిజాంపేట్, మధురా నగర్‌తో పాటు పలు కాలనీలలో పర్యటించిన వివేక్ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి స్థానికుల నుండి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మధురానగర్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ రోడ్ల నిర్మాణం, మరమ్మతులు, పారిశుధ్య నిర్వహణ, దోమల బెడద, వీధి దీపాల మరమ్మతులు, మంజీరా నీటి సమస్య, స్మశాన వాటికల అభివృద్ధి, సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్ల నిర్వహణ, వెజ్, నాన్ వెజ్ మార్కెట్ల ఏర్పాటు, చెరువుల సుందరీకరణతో పాటు మౌలిక వసతుల కల్పన పై అధికారులతో వివేక్ చర్చించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనతో పాటు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని అన్నారు. గత పన్నెండు ఏళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులను వెచ్చించి కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని, మిగిలిన సమస్యలను సైతం త్వరితగతిన పరిష్కరిస్తామని చెప్పారు. గ్రామ పంచాయతీ నుండి కార్పొరేషన్, నేడు జీహెచ్ఎంసి విలీనం వరకు నిజాంపేట్ కార్పొరేషన్ ఎంతగానో అభివృద్ధి చెందిందని వివరించారు. పెరుగుతున్న జనాభా, పట్టణీకరణకు అనుగుణంగా మౌలిక వసతులను కల్పించి అభివృద్ధి పర్చాలని అందు కోసం అధికారులు పాటుపడాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్కిల్ ఉపకమిషనర్ సాబెర్ అలీ, ఇంజనీరింగ్ ఏఈ ప్రవీన్ కుమార్, ఎస్ డబ్ల్యూ ఎం శరన్ తేజ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



## విష్ణువర్ధన్ రెడ్డికి పిహెచ్‌డి పట్టా ప్రదానం

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** పోచారం సర్కిల్ పరిధి వెంకటాపూర్‌లోని అనురాగ్ విశ్వవిద్యాలయంలోని కప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థి విష్ణు వర్ధన్ రెడ్డి విశిష్టమైన పరిశోధనకు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ(పీహెచ్డీ) పట్టాను అందుకున్నారు.విశిష్ట విజయంపైన ఉపకులపతి,డీన్(స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్)డీన్ ( సిఎస్ఈ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగాధిపతి, అధ్యాపకులు, కుటుంబ సభ్య లు విష్ణు వర్ధన్ రెడ్డికి అభినందనలు తెలియజేశారు. విష్ణు వర్ధన్ రెడ్డి కృషి, పట్టుదల శాస్త్రీయ ప్రతిభను ప్రశంసిస్తూ భవిష్యత్తులో ఆయన మరిన్ని పరిశోధనలు వృత్తిపరమైన విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# ప్రజలకు సేవ చేయడం అదృష్టంగా భావించాలి

### కలెక్టర్ దీపక్ తివారీ




**ప్రజాపక్షం/వికారాబాద్:** జిల్లాలో ట్రైనింగ్ కలెక్టర్ హర్ష్‌చౌదరి 11నెలల శిక్షణ కాలాన్ని పూర్తి చేసుకొని వెళ్తున్న క్రమంలో జిల్లా యంత్రాంగం వీడ్కోలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ ప్రజా సమస్యల ను పరిష్కరించడంలో నిజాయితీగా పని చేయడం సంతృప్తిని కలిగిస్తుందన్నారు. ట్రైనింగ్ 11నెల ల పాటు వివిధ శాఖల్లో ఇచ్చిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ అన్నారు. మారుమూల మండలం దౌల్తాబాద్ తహసీల్దార్‌గా విధులు నిర్వహించే క్రమంలో ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేందుకు మౌలిక సదుపాయాలతో పాటు రెవెన్యూ సమస్యల పెండింగ్‌లు తగ్గించడంలో అంకితభావంతో పనిచేశారని కలెక్టర్ తెలిపారు. తనకు ఇచ్చిన బాధ్యతలను నిజాయితీగా నిర్వహిస్తూ తన పట్లనమ్మకాన్ని పెంపొందించుకున్నారని కలెక్టర్ అన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు, సిబ్బంది, ట్రైనింగ్ కలెక్టర్ మృదుస్వభావి ప్రతి విషయాన్ని క్షణ్ణంగా తెలుసుకునేవారు అన్నారు. ట్రైనింగ్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో శిక్షణ కాలం పూర్తిగా విజయవంతం చేసుకోవడానికి జిల్లా కలెక్టర్లు, జిల్లా అధికారులు తోడ్పాటు అందించారన్నారు. జిల్లాలో శిక్షణ కాలం పూర్తి చేసుకోవడం సంతృప్తిని కలిగించిందని అన్నారు. అనంతరం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఉమాశంకర్ ప్రసాద్, రాజేశ్వరి, డిఆర్ఓ మంగీలాల్, ఆర్‌డిఓ వాసుచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

**పురోగతిలో ఉన్న అభివృద్ధి పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలి**

**కొడంగల్ :** శనివారం కడా కార్యాలయంలో విద్యా, సంక్షేమ మౌలిక సదుపాలయ అభివృద్ధి సంస్థ, పబ్లిక్ హెల్త్, ఆర్‌అండ్‌బి, పంచాయతీ రాజ్,విద్యుత్ శాఖలు చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులపై జిల్లా కలెక్టర్ కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖలకు సంబంధించి మంజూరైన గ్రౌండింగ్ కాని వివిధ అభివృద్ధి పనులను మొదలు పెట్టాలన్నారు. అత్యవసరమైన పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. అంగన్వాడి బీటా రోడ్డు, బ్రిడ్జి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.



నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులను సంబంధిత శాఖ అధికారు లు సమన్వయంతో పనిచేస్తు పనులను వేగవం తం జరిగేలా చూడాలన్నారు. సమీక్ష సమావేశం అనంతరం ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్ పనులు పరిశీలించి నూతన ఫర్నిచర్ సమకూర్చుకోవాలని అధికారులకు సూచించారు. పట్టణ కేంద్రంలోని అంతర్గత మురుగు కాలువల ను పరిశీలించిన కలెక్టర్ సెప్టిక్ ట్యాంక్ నిమిత్తం స్థలాన్ని పరిశీలించారు.

సిమ్మింగ్ పూల్, చెరువు సుందరీకరణ, డిగ్రీ కళాశాల దుద్యాల మండలంలోని ఎడ్యుకేషన్ హబ్ లో చేపడుతున్న పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈడబ్లుఐడిఎస్ ఎస్ఇ విజయభాస్కర్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, సురేష్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, రవిప్రసాద్, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, దుద్యాల తహసీల్దార్ కిషన్‌నాయక్, తది తదితరులు పాల్గొన్నారు.



## యువత క్రీడల్లో రాణించాలి

### మంత్రి దామోదర్ రాజనర్సింహా

**ప్రజాపక్షం/చర్లపల్లి:** యువత క్రీడల్లో రాణించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా అన్నారు. కాప్రా ఓం శక్తి గ్రూప్ ఆధ్వర్యంలో ఫైర్ ర్యాలీ ప్రో బాడ్మింటన్ అకాడమీని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలసి రాజ నర్సింహ ప్రారంభించారు. బాడ్మింటన్ వంటి క్రీడల్లో యువత ముందుకు రావాలని, బాడ్మింటన్‌లో యువత ప్రతిభ కనబర్చి రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకురావాలని సూచించారు. క్రీడా వసతులు మరింత అభివృద్ధి చెందేలా ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి తెలిపారు. అకాడమీని ప్రారంభించిన అనంతరం క్రీడాకారులకు ప్రోత్సాహం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నవీన్‌గౌడ్, మాధవి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.




## నీటి సరఫరా సమస్య లేకుండా చూడాలి

### మున్సిపల్ చైర్‌పర్సన్ అనన్య

**ప్రజాపక్షం/వికారాబాద్ :** శనివారం వికారాబాద్ మున్సిపల్ సాధారణ సమావేశం చైర్ పర్సన్ అనన్య అధ్యక్షతన జరిగింది. 14అంశాల ఎజెండాను కౌన్సిలర్ సభ్యులందరు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ నీటి సరఫరాలో ఎక్కడ సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వీధి దీపాల నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాలని, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలను వార్డు అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు. వాటర్ టాక్స్ దశలవారీగా 6నెలల లోపు చెల్లించాలని ప్రజలందరూ సహకరించాలని తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో90శాతం పైగా పన్నులు వసూలు చేసిన బిఎన్ కలెక్టర్లను సన్మానించారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ విక్రంసింహారెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



## ఉచిత మెగా వైద్య శిబిరం

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** కాంగ్రెస్ పార్టీ మందలపు సాయిబాబు చౌదరి ఆధ్వర్యంలో వాసన్ ఐ కేర్, ఏషియన్ డెంటల్, సార్యాస్ హాస్పిటల్ వారి సౌజన్యంతో శనివారం కూకట్‌పల్లి నియోకవర్గం కెపిహెచ్‌బి కాలనీ 6వ ఫేస్, అబ్దుల్ కలాం పార్కులో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మందలపు సాయిబాబు చౌదరి మాట్లాడుతూ ఈ ఉచిత వైద్య శిబిరంలో కంటి, దంత, సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్యం కోసం, ఉచిత ఆరోగ్య సేవలు ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాజా నవీన్, రామ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



## సంక్షేమ పథకాలతో ఆర్థికంగా ఎదగాలి

### రాష్ట్ర దివ్యాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అంది పుచ్చుకొని ఆర్థికంగా ఎదగాలని రాష్ట్ర దివ్యాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. ఆల్వాల్‌లోని సఖి కేంద్రంలో శనివారం జిల్లా సంక్షేమ అధికారి శారద, జిల్లా దివ్యాంగుల అసోసియేషన్ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కొంతమంది లబ్దిదారులకు ఉపకరణాలను పంపిణీ చేసారు.



## పాలకుల నిర్లక్ష్యం వల్ల నేటికీ దళితులపై దాడులు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :**ఈ నెల 18, 19 తేదీల్లో వరంగల్‌లో జరుగనున్న డిహెచ్‌పిఎస్ రెండవ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని డిహెచ్‌పిఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు చిలుముల మల్లేశం ఆధ్వర్యంలో పోస్టర్లను శనివారం విడుదల చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వతంత్రం లభించి 76 ఏళ్లు గడుస్తున్నా పాలకుల నిర్లక్ష్యం వల్ల దళితులకు రావల్సిన హక్కులు దక్కక పోగా నేటికీ దళితులపై దాడులు మాత్రం ఆగటం లేదని వాపోయారు. పాలకులు సైతం దళితుల అభివృద్ధికి తోడ్పడటం లేదన్నారు. ఇదే ధోరణి కొనసాగితే దళితులు ఏకమై ఉద్యమాలు చేసేందుకు సిద్దమయ్యేందుకు ప్రణాళికలు రూపొందిచనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్, కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, ఎల్లయ్య, డిహెచ్‌పిఎస్ నేతలు శంకర్, సోమయ్య, జయమ్మ, మల్లిక, కృష్ణ, రాములు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఆలయానికి విరాళం అందజేత

**ప్రజాపక్షం/చర్లపల్లి:** జిహెచ్ఎంసి పరిధిలోని అహ్మద్‌గూడ శ్రీదాసాంజనేయ దేవాలయ అభివృద్ధికి కీసర మండల పరిషత్ మాజీ అధ్యక్షులు శ్రీ రామారం సుజాత కుమారులు రామారం ప్రదీప్ 51 వేల రూపాయల విరాళాన్ని కమిటీ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపి శాలువాతో సత్కరించారు.దాసాంజనేయ ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నాయకులు కొత్త భాస్కర్‌గౌడ్,నానునాయక్,సంతోష్‌గౌడ్,సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

